

### శిరోభారం

ఎలిజబెత్ త్రోమోర్టాన్‌తో సర్ వాల్టర్‌రాలీ వివాహం చరిత్రలో ఒక పెద్ద ప్రేమాయణం. స్పెయిన్ రాజు అభిమానిగా భావించి జేమ్స్ రాజు సర్ వాల్టర్ రాలీని ఉరి తీయించాడు. ఎలిజబెత్‌రాలీ తన మిగతా 29 ఏళ్ళ వైధవ్య జీవితాన్నీ కూడా ఆయన తలను చేతపట్టుకునే గడిపింది. ఆ తర్వాత వారి కుమారుడు కార్యూ రాలీ కూడా తల్లినే అనుసరించి ఆమరణాంతం తండ్రి తలను అంటిపెట్టుకుని ఉన్నాడు. అతడు 1666 లో మరణించాడు.

"అయితే తక్షణం కళ్ళు తనిఖీ చేయించుకో. సరే! నేనే చూస్తాను" అన్నాడు పానకాలు.

"గుర్తుందిరా నే చెప్పింది? చూడగానే కళ్ళు జిగ్‌మని మూర్ఛపోయేలావుండాలి" అన్నాడు గోవిందం.

పానకాలు తల ఊపేడు.

* * *

వారం రోజుల్లో పానకాలు గోవిందాన్ని పెళ్ళి చూపులకి తీసుకెళ్ళేడు. ఆ అమ్మాయి నడుస్తూ వస్తుంటే గోవిందం చుట్టుకుపోయేట్ట. తల దించుకు కూర్చుంటే ఆ ముగ్ధ మోహనాకారానికి గుండెల్లో ఏదో వికారంతో బాధపడిపోయేట్ట. ఆ అమ్మాయినో సారి తలెత్తమని చెప్పిస్తే తలెత్తి ఓరగా అరమోడ్పు కళ్ళతో క్షణం చూసి అంతలో అందంగా సిగ్గుపడిపోయిందిట. ఆ చూపు గుండెల్లో నుండి దూసుకుపోగానే చప్పున "మీదే ఆలస్యం" అన్నాట్ట గోవిందం!

* * *

నెలరోజుల తర్వాత —

ముందురోజు జరిగిన మొదటిరాత్రి ముచ్చట్లు చెప్పేందుకు ఎప్పుడొస్తాడా అని గోవిందంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాం క్లబ్బులో.

"ఒరేయ్ పానకాలూ! ఎక్కడ్రా.... ఏకాలికాకాలు విరిచేస్తా్రనా గాడిదా" అంటూ రివ్వున వచ్చేడు గోవిందం.

అవాక్కయిపోయేం!

"ఏవయ్యింది?" తాపీగా అడిగేడు పానకాలు.

గోవిందం కేకలేస్తున్నాడు. మధ్య మధ్య భోరున ఏడుస్తున్నాడు.

"పళ్ళూడదంతాను వెధవా! ఏడ్చయినా చెప్పు. చెప్పయినా ఏడు" అన్నాడు పానకాలు.

"చేసిందిచాలక పళ్ళూడదంతావా? ఏదీ తన్ను....యీ....యీ." పళ్ళు చూపించేడు గోవిందం.

"చెప్పు గోవిందం. ఏవయ్యింది?" అనునయంగా అడిగేను.

"చూడగానే మూర్ఛపోయేను" అంటూ భోరున ఏడ్చేడు వాడు.

"నువ్వే అన్నావుగా పాపం. మూర్ఛపోవాలని" అన్నాడు పానకాలు.

గోవిందం చర్రున లేవబోయేడు. "ఏం జరిగిందో చెప్పరా" అని హనుమంతు వాడి భుజం పట్టుకుని ఆపేడు.

వాడు ఘొల్లు మన్నాడు—

"అర్థమై చావనంత నత్తిరా బాబూ!"

మేమంతా ఖస్సున వేళ్ళు కొరుక్కుని ఆ బాధ భరించలేక గిలగిల్లాడిపోయేం!

### గుండె

పొడుగాటి గోళ్ళతో
బెతిక లూడదీస్తారు
పెళ్ళలు పెళ్ళలు రాలుస్తారు.
మొండిగానో బోసిగానో
చినిగిన చొక్కాల్తనో
గుండె అలానే వుంటుంది.
పూలు పీకేస్తారు
కాయలు రాల్చేస్తారు
కొమ్మలు నరికేస్తారు
కానీ —
ఇగుర్లు పెట్టే గుండె ముందు
కొండ బలాదూర్ —
కనపడకండా ఆకాశంలో కెగిరే
గుండెముందు
పక్షి దిగదుడుపు —
గాలీ నీరూ మంటా
పుట్టి ప్రవర్ధమానమయ్యే
గుండె
బెరడు నూడబెరగ్గలరేమో కానీ
లోన ప్రవహించె ప్రాణస్పందనల్ని
ఏ చేతి వేళ్ళూ తాకలేవు.

—కె. శివారెడ్డి

# అంకితం



అయిదు వందల పేజీల నవల రాయడం పూర్తిచేసిన పెళ్లాం బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంది. వారం రోజులు రాత్రింబగళ్ళు కూర్చొని రాసిన ఆ బొత్తు కాగితాల్ని మురిపెంగా చూసుకొంది. మొదటి వాక్యంనుంచి చివరి వాక్యందాకా మొగుళ్ల పెళ్లాల్ని పెటే బాధల్తో నిండిఉన్న ఆ నవల చూసి చిన్నగా నవ్వుకొంది.

ఇప్పుడు చూడాలి ఈయనగారు ఈ నవల చదివి ఏమంటారో! అందులో ప్రతి వాక్యం తనగురించేనని తెలుసుగా! పత్రిక్కి పంపించవద్దంటాడా? తేరగా వెయ్యిరూపాయలు వస్తుంటే వద్దంటాడా?

కాని పంపిస్తే తనగుట్టు అందరికీ బట్టబయలై పోదూ! లేకపోతే నెలకో నవలైనా రాయకపోతే పచ్చి మంచి నీళ్ళయినా ముట్టుకోనియ్యడా! ఇంతటితో ఈ బాధ తప్పుతుంది.

ఆలోచనలో మునిగిపోయిన పెళ్లాం

అవధానుల విజయలక్ష్మి

మొగుడు రావడం, ఆ నవలని అక్కడ క్కడ తిరగెయ్యడం మధ్య మధ్యలో చదవడం గమనించలేదు. అంతా చదివిన ఆ మొగుడు ఏదో ఆలోచించి తల పంకించాడు. గబగబా వంటిట్లోకెళ్ళి పనసకాయలు తరిగే కత్తి తీసుకొచ్చాడు. టేబిల్ మీదున్న పెన్ను తీశాడు. తెల్ల కాగితం తీసి టేబుల్ మీద పరిచాడు.

"ఏయ్ నిన్నే" ఉలిక్కిపడింది పెళ్లాం.

"పెన్ను తీయ్" గద్దించాడు.

బిత్తరపోయి పెన్ను తీసింది.

"నేను చెప్పినట్టు రాయి...."

ఉరిమి చూశాడు....

ఒణుకుతూ రాయడం మొదలెట్టింది.

"ఈ నవలలోని మగవారిలా ఒక్క నిమిషం కూడా ప్రవర్తించని నా భర్తకి ఈ నవల అంకితం."

రాసిన వెంటనే ఆ కాగితం చేతిలోంచి లాక్కొని, నవలతో పాటు కవర్లో పెట్టి.. బంకతో అంటించి, విజయగర్వంతో పోస్టాఫీసు వైపు నడిచాడా మొగుడు.




MCA/PDC/62/Tel